
# వర్ధిల్లాలి వర్ధిల్లాలి!

గుడిసేవ సుందరరామయ్య

శరీరానికి వెచ్చని స్పర్శ తగిలేసరికి ఉలిక్కిపడి కళ్లు తెరిచింది సీతాలు వీపుమీదున్న చంటోడి చేతిని మెల్లగా తొలగించుకొని లేచి కూర్చుంది ఓరగా వేసున్న తడికెను లాగి రోడ్డుమీదికి చూసింది అప్పటికే వాకిట్లోకి నీడ వచ్చేసింది ఓ లబ్బో! 'ఆలెస్సమయి పోయింది!' అనుకొంటూ లేచి నిలబడింది అంతలోనే ఏదో గుర్తుకు వచ్చినట్లుయి నిద్ర పోతున్న చంటోడి వొంటిమీద చేయివేసి చూసింది ఒళ్లు కాలిపోతూంది 'పాడు జొరం! మూణ్ణాళ్ల నుండి తగ్గనేలేదు దీనికి తోడు యీ యెధవ యీగలొకటి అనుకొంటూ చీరకొంగుతో చంటోడి ఒంటిమీద వాలుతున్న ఈగలను తోలింది కాస్సేపు చంటోడు పండుకొన్న చింకిచాపను మెల్లగా ఓ ప్రక్కకులాగి, దండెమ్మీద వ్రేలాడుతున్న చిరుగుల బనీన్ను చంటోడి వొంటిమీద కప్పింది

తడికె తలుపు తోసుకొని రోడ్డు మీదికివచ్చి 'అమ్మలూ! అమ్మలూ! అని కూతుర్ని కేకేసింది రోడ్డుకు అవతలి ప్రక్కనవున్న కొళాయి దగ్గర కుండ పుచ్చుకొని నిల్చున్న కూతురు తల్లి ఎలుపు వినగానే



కుండను అక్కడే వదిలేసి గుడిసె దగ్గరకు వచ్చింది

"పెద్దోడు ఏడకు పోయేడే?"

"నాకేమి సెప్పలేదమ్మా! ఎవరో మా రాజు ఫాకటేరులో వుద్యోగం యిప్పిత్తానన్నారని పొద్దున్న నీతో సెప్పాడుగా! ఒకేళ అరి దగ్గరకెళ్లాడేమో!" అంది కూతురు

"యేదం సన్నాసి! వాకు సెప్పనేలేదే! ఎందేళదాకా అగితే ఆడి బాబుకూడా ఆడితో పాటు యెల్లి ఆ మా రాజుని వుద్యోగం అడిగోళ్లుగా! ఆ పెద్దోడికసలు తలకాయ లేదే!' అంటూ విసుక్కొంది సీతాలు

"ఆడు సేసిందాంట్లో తప్పేం లేదు. అయ్య వొచ్చాక యెళ్లాలంటే అర్ధరేతిరి దాటుతాది ఈలోగా ఆ మా రాజు వుద్యోగం ఎవరికో యిచ్చేత్తాడు" అంటూ తల్లికి బోధచేసింది కూతురు

"సర్లే! ఆడిసంగతి తర్వాత సూద్దాం! ఈ సంటోడికి జొరం బాగా యెక్కువయినట్టున్నాది! ఆసారి గారి మందులేపీ పని సేసినట్టు లేవు ఎట్నాగయినా సరే మసక పడ్డాక పెద్ద డాకటేరు దగ్గరికి తీసికెళ్లాలి! నేను పెందలకాడే సాకిరీ సేసుకొని వచ్చేత్తా కాని నువ్వు యీణ్ణి సూత్తుండు! అన్నట్టు సిన్నోడు, సిట్టి ఏడకు పోయారు?"

"ఎవరో పెద్దింటి మారాజు సచ్చిపోయినాడని పైసలు యిసురుతున్నారంట! యీళ్లిద్దరూ ఆ వూరేగింపు వెనే లగెత్తారు!" అంది కూతురు భయం భయంగా

"ఛీ! ఛీ! పాడుపిల్లలు! యీళ్లకు యెన్ని తడవులు సెప్పినా బుద్ధిరేదు సచ్చినోడి పైసలుకోసం కక్కుర్తి ఎడొస్తంటేయిరు! ఆళ్లనసలు నువ్వెందుకు యెళ్లనిచ్చావే?"అని పెద్దకూతుర్ని కేకలేసింది సీతాలు,

"బాజాలుమోత యినగానే లగెత్తారు, నేనేమో అక్కడ కొళాయికాడ కూకున్నా! నీళ్లు వొచ్చినట్టున్నాయి అడ సానామంది జనం వున్నారు నేను బేగే యెళ్లకపోతే నీళ్లు దొరకవు!" అనేసి వెళ్లబోయింది అమ్మలు

"నాక్కూడా సానా పొద్దెక్కిపోయినాది! ఆ నీళ్లపని కాగానే సంటోడి దగ్గరే కూకో!" అనేసి సీతాలు లోపలికి వచ్చింది

తను కట్టుకున్న చీరవైపు ఒకసారిచూసుకొంది చీరనిండా రంగు రంగుల అతుకులు కన్పించాయి ఆ రోజు మాత్రం ఆ చీరను కట్టుకు వెళ్లాలన్పించలేదు సీతాలుకు దండెమ్మీదికి దృష్టిమరల్చింది ప్రొద్దున్న ఎడిచిన చీర కన్పించింది చీరబాగా మురికిపట్టివుంది ఆ చీరను అందుకొని చేత్తోదులిపి చూసింది దరిద్రుని అంటిపెట్టుకొన్న దురదృష్టంలా ఆదుమ్ము ఏమాత్రం చీరను వదల్లేదు ఎంత సరిపెట్టుకొన్నా చీర నల్లగానే వున్నదన్న విషయాన్ని కాదనలేకపోయింది సీతాలు మనస్సు తలుపును మూసి కట్టుకొన్న చీరను విడిచి, మాసిన చీరనే రెండో వైపు కట్టుకొంది విరిగిపోయిన అద్దంముక్కలో ముఖం చూసుకొంటూ చేత్తోనే జుత్తును సవరించుకొని, ముడివేసుకొంది కుండలో వున్న నీళ్లను ఓ గ్లాసుడు గొంతులో పోసుకొంది, తడికె

తలుపును ఓరగా వేసి రోడ్డు మీదికివచ్చింది.

సూర్యుని ధాటి తగ్గినా యింకా వాతావరణంలో చల్లదనం రాలేదు. తారు రోడ్డు యింకా అట్లా పెనంలా కాలుతూనే వుంది

'ఈ రోడ్డు కేంపోయే కాలమొచ్చింది? సూరీడు సల్లబడినా యిదింకా కాళ్లను కాలుస్తూందీ'అని విసుక్కొంటూ బాధగా అడుగులువేస్తూండగా సీతాలు 'గోరుచుట్టుమీద రోకటిపోటు' అన్నట్లుగా కిరాణాకొట్టు అరుగు మీదషావుకారు శేషావతారం కన్పించాడు ఆమెకు అతన్ని చూడగానే సీతాలుకు అరికాళ్ల మంట నెత్తికెక్కింది. గుండె గుభేలుమంది. తన వైపె చూస్తున్న శేషావతారాన్ని చూడగానే చీర కొంగును సరిచేసుకొని తల వంచుకొని ముందుకు వెళ్లిపోవటానికి ప్రయత్నించింది రోడ్డుమీద కాళ్ళు కాలటంచేత కల్గిన బాధ కంటె శేషావతారం కళ్లు తన శరీరాన్ని చూస్తూండటంచేత కలిగిన బాధే ఎక్కువైంది సీతాలుకు అతన్ని తప్పించుకొని పక్కకు వెళ్లాలనుకొంది కాని ఆమె ప్రయత్నం ఫలించలేదు

"సీతాలూ!" అని బొంగురు గొంతుకతో అరిచాడు షావుకారు సైరన్ కూతలా విన్పించిన ఆ అరుపుకు యింటి దగ్గర ఆలస్యంగా బయల్దేరిన కూలీలా వెదిరిపోయింది సీతాలు.

రక్కున ఆగిపోయింది.

"ఏమిటే! మొఖం తప్పించుకొని తిరుగుతున్నావ్! నా బాకీ సంగతి ఏం చేశావ్? నీ మొగుణ్ణి అడిగితే నిన్నడగమంటాడు నువ్వేమో మొఖం దాచేసి పోటానికి చూస్తున్నావ్! ఇట్టాగయితే మేం వ్యాపారం చేసుకోటం ఎట్లాగే అమ్మా!" అన్నాడు షావుకారు తుపుక్కున నేలమీదికి వూస్తూ.

"రేపు జీతాలు రాగ్గానే యిచ్చేత్తానండి!" అంది సీతాలు తల వంచుకొనే

"జీతాలా?" అంటూ గారపళ్లు బయట పడేలా వికృతంగా నవ్వాడు షావుకారు

సీతాలుకు అసహ్యం కల్గింది అతని వైఖరి

"పెద్ద ఆఫీసరులా మాట్లాడుతున్నావే? కూలిపనిచేస్తూ కూడా జీతాలు రావాలి–అప్పు తీరుస్తాను అంటున్నావ్! బలే గడుగ్గాయినే!" అంటూ మళ్లీ నవ్వాడు.

"నా బాకీ తప్పకుండా తీర్చుకొంటాను. నాకు ఆలెస్యమయిపోతున్నాది" అంటూ గబగబ అడుగులు వేసింది సీతాలు

## వర్ధిల్లాలి వర్ధిల్లాలి!

"ఇట్టాగయితే లాభంలేదు! ఇకనుంచి అరిచి చచ్చినా సరుకులు కట్టను, జాగ్రత్త!" అంటూ చుట్టను నోట్లో పెట్టుకొన్నాడు శేషావతారం.

ఆ మాటల్ని సీతాలు విన్పించుకోలేదు. ఆమె మనస్సంతా అంతకుముందు షావుకారుతో తనకు జరిగిన సంభాషణను గురించే ఆలోచిస్తూంది

'జీతాలు రాగానే బాకీ యిత్తానంటే ఆడలా నవ్వుతాడెందుకు?' అని మనస్సులోనే ప్రశ్నించుకొంది కూలిపనిచేసినా, గుమాస్తాపనిసేసినా

### ముడుచుకున్న పుడమి

కన్నులేని తెగవోలె,
కడలి ఆడుచున్నది,
ఘున్నుతిన్న పాము వోలె
పుడమి ముడుచుకున్నది!
తాటితోపు నీడలలో
వంగాలుగులే వినిపించెను,
ఏటిగోని యసుక పొరలు
వేడిమినే కలిగించెను!
తలలూచే రసాలముల
చిరుపూవులు ఇవాలెను,
కలనైనా కరగిపోని
కన్నీరుల సుడిరేగెను!
కోరలతో గురివిందలు
గులాబీని కరచినవి,
వెన్నెలలను పీల్చుకున్న
వెర్రి తమసు లరచినవి!
ఏనాటికి జలనిధిలో
సుధారసము లుదయించును?
ఏనాటికి ఎడదయెదలో
వసంతాలు చిగురించును?

— ఆకొండి వెంకటరత్నం.

తను మాత్రం జీతాన్ని సంపాదించుకోటం లేదా? జీతమంటే ఆడికెందుకంత ఎగతాళి? సదువు కొన్నోళ్లంతా ఆఫీసుల్లో కెళ్లి పంకాల కింద మంచి మంచి కుర్చీల్లో కూకుని పని సేసుకొంటారు తనేమో ఎండనక, వాననక రెక్కలు ముక్కలయ్యేటట్లు సాకిరీసేసి సంపాయించుకొంటూంది జీతాన్ని. అయ్యగారికి ఆ పీసోళ్లు జీతం యెలాగిత్తున్నారో తనకూ ఆడా అయ్యగారలా జీతం యిత్తున్నారు. మరి ఆ షావుకారు జీతమంటే కోతిలానవ్వుతాడేంటి? పిచ్చినాయాల! అప్పు సేయటం మూలంగానే ఆడికి మరీ అలుసయిపోయాం!

'అసలు దీనికంతటికీ కారణం తనను మనువాడినోడు. బీడీలకి, సిల్లరఖర్చులకు షావుకారు దగ్గర అప్పుచేసిబాకీ పెంచేశాడు దానికితోడు వడ్డీకూడా వసూలు సేత్తాడు షావుకారు తనెంతగుట్టుగా సంసారాన్ని లాక్కువత్తున్నా ఏదో ఓ బాధ వత్తూనే వుంది

తన మొగుడు అయిను ఫాక్టరీలో పని సేత్తున్నాడన్నమాటే కాని ఆడీ సంపాదనలో సయాపైసా కూడా తన సేతికివ్వడు ఎప్పుడైనా బుద్ధి పుడితే కూర, నార తెచ్చుకొంటాడు రోజు రోజుకూధరలు పెరిగిపోతుంటే ఆడికి సీముకుట్టినట్టు కూడాలేదు ఇక తన దేమో ఎదుగూ బొదుగూ లేని సంపాదనై పోయింది. యిస్తరాకులు కుడితే రోజుకు ఓ రూపాయి డబ్బులుకంటె ఎక్కువ మిగలటం లేదు అయ్యగారింట్లోపని సేత్తున్నందుకు వచ్చేడబ్బు ఎటూ సాలటం లేదు. అయ్యగారింట్లో ఆరేళ్లనుంచీ తనుసాకిరీసేత్తూంది. పిల్లలు యిద్దరే అయినా ఆరింట్లో సాకిరీ ఎక్కువే! ఇల్లు వూడవటం కాణ్ణుంచీ, వంట సేయటంవరకు అన్నిపనులూ తనే సేయాలి! జీతం పెంచమని అమ్మగార్ని అడిగితే ఆలో సిద్దాంలే అంటుంది ఏదో బొక్కు సదువుకొంటూ. ఇక అయ్యగారితో మాట్లాడాలంటే తనకు సచ్చేంత భయం! ఆదేదో పెద్ద ఆఫీసులో పని సేత్తున్నారంట! జీతంకూడా ఏడొందలు పైగా వొత్తుందంట! మరి తన లాంటోళ్లకివ్వాలంటే యెనకాడతారెందుకు? ఏం మనుషులో? ఏమిటో? ఏమైనాసరే జీతం పెంచమని యివ్వాల అయ్యగార్ని అడగాల్సిందే! శనివారం మద్దాన్నం యింటికాడే వుంటారుకూడా! ఆరిచ్చే జీతంతో యిక ముందు తామంతా బతకటం సానా కట్టం! ఇవి యెనకటి రోజులు కాదు! పిల్లలు పెద్దోళ్లవుతున్న కొద్దీ ఖర్చులు కూడా పెరుగుతుండాయి. దానికితోడు ఎప్పుడూ ఎవరో ఒకళ్లకు రోగమే! అబ్బ! ఈ లోకంలో కూలిపని సేసి బతకటమే కష్టం! ఏ షావుకారు రాజుల యింట్లోనో పుట్టినోళ్లకే రోజులు!'

లారీహారన్ 'బాయ్' మనగానే సీతాలు ఆలోచనలకు అంతరాయం కల్గింది.

'ఆలోచనలతోనే అయ్యగారింటికొచ్చేశాను' అనుకొంటూ గేటు తీసుకొని లోపలికి వెళ్లింది సీతాలు. అయ్యగారు వరండాలో కూర్చుని ఏదో రాసుకొంటున్నాడు, సీతాలు

వరండా ప్రక్కనుంచి వెళ్లి వంటగది చేరు కొంది. గది తలుపులు తెరిచే వున్నాయి. సీతాలుకు ఆశ్చర్యం అనుమానం కల్గాయి. సాధారణంగా సీతాలు వెళ్లేవరకు వంటగది తలుపులు మూసేవుండేవి. సీతాలు తలుపు తట్టితే కాని అమ్మగారు వచ్చి తలుపు తీసేది కాదు. అలాంటిది ఆ రోజు తను వెళ్లేసరికే వంటగది తలుపులు తీసివుండటం ఆమెకు ఆశ్చర్యాన్ని కల్గించింది. ఒక రకంగా భయం కూడా కల్గింది. తను రావటం బాగా ఆలస్య మైనదేమో అనుకొంది మనసులో.

వంటగదిలోకి అడుగు పెడ్తున్న సీతాలుకు పాలగిన్నెను తెస్తున్న అమ్మగారు ఎదురు పడింది

"ఏమే, సీతాలూ! యింత లేటుగా వచ్చావేమిటి?" వాచీ చూసుకొంటూ అడిగింది అమ్మగారు.

"మా సంటోడికి జొరం తగ్గలేదమ్మ గారూ! అందుకనే ఓ అడుగు ఆలెస్సమయి పోనాది?" అంది సీతాలు భయం భయంగా.

"మాకు అర్జంటు పనులున్నప్పుడే నువ్వు లేటుగా వస్తావు. ఊఁ.. సర్లే... త్వరగా యిల్లు వూడ్చి, స్టవ్ అంటించు! టీ పెట్టాలి! అయ్యగారి కివ్వాళ ఏదో పనుం దట! బయటకు వెళ్తున్నారు??" అంటూ పాలగిన్నెను సీతాలుకుఅందించిందిఅమ్మగారు.

సీతాలు పాలగిన్నెను అందుకొని టేబుల్ మీద పెట్టింది. అమ్మగారు ప్రక్కగదిలోకి వెళ్లి డబుల్‌కాట్‌మీద వాలిపోయి సగం చదివిన నవలను చేత పుచ్చుకొంది. మరో పావుగంటకల్లా యిల్లు వూడ్వటం, అంట్లు కడగటం, బిందెల్లో నీళ్లు పట్టడం లాంటి చిల్లర పనులన్నీ ముగించుకొని అమ్మ గారి గదిలోకి వెళ్లింది సీతాలు.

నవలలో పూర్తిగా మునిగిపోయిన అమ్మ గారు సీతాలు రాకనే గమనించలేదు. రెండు మూడు క్షణాలపాటు తటపటాయించి సీతాలే "అమ్మగారూ!"అని పిల్చింది.

"ఏమిటే?"అని అడిగింది తలెత్తి చూడ కుండనే.

"టీ తయారయింది. అయ్యగారికి, తమరికి తెమ్మంటారా?"అనిఅడిగిందిసీతాలు.

"ముందు అయ్యగారికిచ్చిరా! నే నివ్వాళ టీ త్రాగను. బోర్న్‌వీటా కాస్త కలిపి పట్టా!" అంది అమ్మగారు యూ ఫోమ్ బెడ్ మీద ఒత్తిగిలి పండుకొంటూ.

ఏదోయాంత్రికంగా మాట్లాడుతున్నదన్న మాటేకాని అమ్మగారి ధ్యాసంతా నవల మీదే వుందన్న విషయాన్ని సీతాలు గ్రహించింది. అదే సరైన అదననుకొని "అమ్మగారూ!" అని మళ్లీ పిల్చింది.

"ఊఁ..."

"అయ్యగార్ని వాజీతం విషయం అడగాలని వుంది. మరి అడగమంటారా ?"

"ఊఁ" అంది అమ్మగారు పరధ్యానంగా.

ఆనందం కల్గింది సీతాలుకు. "పూజారి వరం యిచ్చినట్టే యిక దేవుడే వరం యివ్వాలి' అనుకొంటూ వంటగదిలోకివెళ్లింది సీతాలు.

టీ కప్పు తీసికెళ్లి అయ్యగారి ముందున్న టీ పాయ్‌మీద వుంచింది సీతాలు. అంతవరకు ఏకదీక్షతో ఏదో రాసుకొంటున్న అయ్యగారు పొగలు కక్కుతున్న టీని చూడగానే పెన్ను ప్రక్కనే పెట్టాడు

"అమ్మగారేం చేస్తున్నారు?" అని అడిగాడు టీ కప్పును అందుకొంటూ.

"ఏదో సదువుకొంటున్నారండి!" అంది సీతాలు.

"ఓహో" అని టీ త్రాగటం మొదలెట్టారు అయ్యగారు. అక్కడే నిలబడిపోయిన సీతాలు మెల్లగా "అయ్యగారూ!"అనిపిల్చింది. "ఊఁ..."అన్నారు అయ్యగారు టీని చప్పరిస్తూ.

"సానాకాలంనుంచి అడగాలనుకొంటున్నా నండి!'అంది నీళ్లు నములుతూ.

"ఏమిటి?"అన్నారు అయ్యగారు.

"మా యింట్లో కుటుంబం జరగటం కట్టమైపోతున్నాది! యింటాయన సంపాదన మరీ తక్కువైపోనాది! గోజుకు రెండు పూటలూ తిండి తిని రెండు నెలలైంది అయ్యగారూ!"


"అయితే ఏమంటావ్ ?" అన్నాడు కాళీ చేసిన కప్పును టీపాయ్‌మీద పెడ్తూ.

"మరేంలేదండి! ఈనెల కాణ్నుంచి నాకిచ్చే జీతం కొంచెం పెంచమని యేదు కొంటున్నాను."

"మళ్లీ జీతం పెంచాలంటావా? ఆ మధ్య యిలాగే అడిగితే పదిహేను రూపాయలు చేశాంకదా! యిప్పుడు మళ్లీ నీ గొడవేంటి? అడిగినప్పుడల్లా జీతాలు పెరుగు తాయనుకొన్నావా?" కొంచెం కోపంగా అన్నారు అయ్యగారు.

"నాకు జీతం పెంచి రెండేళ్లయినాదండి! అప్పట్నుంచి నేను జీతం పెంచమని అడగనే లేదు. తప్పనిసరయి సంసారాన్ని ఈదలేక పోవటంచేత యిప్పుడు అడగాల్సొచ్చింది అయ్యగారూ! ఈ జీతం ఎవరికీ గిట్టుబాటు కాదయ్యా! మీ పక్కింటి లాయరుగారు పంకజానికి పాతిక రూపాయి లిస్తారంట! కావాలంటే కనుక్కోండి!" ధైర్యం తెచ్చు కొని పల్కింది సీతాలు.

"దానికీ నీకు పోలికేముంది? అదెంత చాకిరీ చేస్తుందో నీ కసలు తెలుసా? ఆ లాయర్‌గారికి అరడజను మంది పిల్లలు. వాళ్ల పనిమనిషితో కంపేర్ చేసుకుంటే ఎట్లా?" అంటూ గోల్డ్‌ఫ్లాక్ సిగరెట్ను



నోట్లో పెట్టుకొని లైటర్‌తో వెల్గించు కొన్నారు.

''ఏమోనయ్యగారూ ! మీ రెలాగైనా మా మీద దయసూపాలి !'' అంది సీతాలు.

''ఇప్పుడేం లాభంలేదు.! అసలే తిండి దొరక్క కుటుంబాలు సహితం ఆత్మహత్యలు చేసుకొంటున్న యీ రోజుల్లో వున్న జీతం తీసుకోక యీ గొడవేంటి? మా యింట్లో పని చేయటం యిష్టంలేకపోతే చెప్పు ! ఆ పంకజం చెల్లెలు పని చేస్తానన్నదంట ! దాన్నే పెట్టుకొంటాం !'' అంటూ బెదిరించాడు.

సీతాలుకు కంగారు పుట్టింది. జీతం కోసం చూసుకొంటే వున్న నౌకరీయే పోయే టట్లు వుందన్న విషయాన్ని గ్రహించింది.

వెంటనే ''అంతపని మాత్రం సేయకండి బాబూ! ఆ రేళ్లనుంచీ మీ యింటినే నమ్ముకొన్నాను. కట్టాలు అర్దం సేసుకొని జీతం డబ్బులు పెంచుతా రనుకొన్నాను. పోన్లెండి అయ్యగారూ! ఎలాగో బాధపడి పని చేసుకొంటాను. నన్ను పన్లోంచి మాత్రం తీసెయ్యకండి'' అంది.

అంతలోనే గేటుతీసిన చప్పుడైంది. ఐదారుగురు వ్యక్తులు లోపలికి వస్తున్నారు. వాళ్లను చూడగానే అయ్యగారు లేచి నిలబడి నవ్వుతూ రమ్మని సైగ చేశారు.

ఖాళీ కప్పును పుచ్చుకొని నిలబడివున్న సీతాల్ని వుద్దేశించి ''సీతాలూ ! ఫ్రండ్స్ వస్తున్నారు. ఆరు కప్పుల టీ చేసి పట్రా!'' అన్నాడు.

సీతాలు లోపలికి వెళ్లిపోయింది.

''గుడ్‌మార్నింగ్ మిస్టర్ రావ్ !'' అంటూ అర్కరూ వచ్చి సోఫాల్లో కూర్చు న్నారు.

''రిజల్యూషన్ కంప్లీట్ చేశారా ?'' అని అడిగాడు లాల్చీ వేసుకొన్న వ్యక్తి.

''ఆల్ మోస్ట్ ఆల్ కంప్లీటెడ్''అంటూ తను వ్రాసిన కాగితాలను అందించాడు రావు.

''అయితే యివాళ్టి ప్రోగ్రాం సక్సెస్ అవు తుందంటారా ?''

ఓ లావుపాటి వ్యక్తి అనుమానంగా అడిగాడు.

''డెఫినెట్లీ !'' అన్నాడు రావు సగర్వంగా.

''అంతా బాగానే వుందికాని ఆ ఎస్టాబ్లిష్ మెంట్ ఆఫీసర్‌తోనే గొడవగా వుందిగురూ ! వర్కింగ్ అవర్స్‌లో స్లోగన్స్ కొట్టినందుకు మండిపడు తున్నాడు. సెంట్రల్ ఆఫీసుకు రిపోర్టు చేస్తాడట !'

''ఏడిశాడులే ! నిజంగా వాడి కసలు కామన్‌సెన్స్ లేదుగురూ ! ఎంప్లాయీస్ మూవ్‌మెంట్‌ను సపోర్టు చేయాలనే జ్ఞానమే లేదు వాడికి. ఆఫీసర్స్ స్ట్రయిక్‌లో ఈ వ్యక్తి ఎంత ఆక్టివ్ పార్ట్ తీసుకొన్నాడో మీకు తెలుసుగా !ఎక్కౌంట్స్ ఆఫీసర్లు స్ట్రయిక్‌కు సుముఖంగా లేకపోయేసరికి వాళ్లఖిళ్లచుట్టూ తిరిగి వాళ్లిద్దరిచేత క్యాజువల్ లీవ్స్ పెట్టించి మొత్తానికి స్ట్రయిక్‌ను సక్సెస్ చేయించాడు. అలాంటిది క్లాసు త్రీమూవ్‌మెంట్‌ను సపోర్టు



చేయటంలేదు!'' అన్నాడు రావు పుద్రేకంగా

''అసలు వాడు రిపోర్ట్సు యివ్వటమే మంచిదిలే గురూ! మన ఏజిటేషన్ హయ్యర్ లెవెల్స్‌కు వెళ్లకపోతే మన కోర్కెలు ఎలా తీరులాయి ?'' అన్నాడు ఓ ఎట్టతల వ్యక్తి

అంతలో సీతాలు ఒక ట్రేలో టీ కప్పులను తెచ్చి టీపాయ్‌మీద పెట్టి లోపలికి వెళ్ళిపోయింది

మరో పదినిమిషాల్లో టీ కప్పులను, సిగరెట్ పాకెట్‌ను ఖాళీచేసి కార్మిక నాయకులంతా యింటి యజమాని రావుగారితో సహా బయటకు వెళ్లిపోయారు

సీతాలు పనులన్నీ ముగించుకొనేసరికి దాదాపు సాయంత్రం అరయింది అమ్మగారి దగ్గర సెలవు పుచ్చుకొని రోడ్డుమీదికి వచ్చింది సీతాలు మనస్సంతా వికలమై పోయింది జీతం పెంచుతారని ఎంతో ఆశ పెట్టుకు వచ్చింది కాని నిరాశతో యింటి దారి పట్టాల్సివచ్చింది అంతవరకు వున్న ఆత్మధైర్యం ఆపెలో సన్నగిల్ల సాగింది ఆమె కళ్ల ముందు కేపావతారం బాకీ, చంటోడి జ్వరం, పైసలు తెచ్చుకోటానికి వెళ్లిన దీనముఖాలు, ఖాళీ కుండలు గిర్రున తిరుగ సాగాయి. తాగుబోతు మొగుణ్ణి యిచ్చినందుకు దేవుణ్ణి తిట్టింది అప్పుక్రింద ఎరుకలిచ్చి అంతులేని వడ్డీని వసూలు చేస్తున్న పాపకారును తిట్టింది మూడ్రోజుల నుంచి చంటోడికి మంచి మందు యివ్వలేకపోతున్న ఆచారిగార్ని తిట్టింది బతకటానికి వీల్లేకుండా తయారైన ఈ లోకాన్ని తిట్టింది గవర్నమెంటోళ్లు సంతానాన్ని తగ్గించుకోమని చెప్తున్నా విన్పించుకోకుండా అయిదుగురు పిల్లల్ని కన్నందుకు తనను తనే కసిగా తిట్టుకుంది మనసులో ఎంతమందిని ఎన్నివిధాల తిట్టుకొన్నప్పటికీ ఎప్పుడూ నవల చదువుకొంటూ కూర్చునే తన యజమానురాలుని గాని, జీతం పెంచనన్న యజమానిని గాని తిట్టలేకపోయింది అందుక్కారణం ఆ యింటితో ఆమెకున్న ఆరేళ్ల అనుబంధం కావచ్చు!

ఆలోచిస్తూ నడుస్తున్న సీతాలు నాల్గు రోడ్ల సెంటర్లో తక్కున ఆగిపోయింది దూరంగా తనవైపే ఏదో వూరేగింపు వస్తున్నట్లు గ్రహించింది, జనమంతా ఎక్కడివారక్కడ ఆగిపోయారు ట్రాఫిక్ పోలీసు హడావుడిగా వున్నాడు, సీతాలు ఓ ప్రక్కగా వెళ్లి నిలబడింది.

''ఆ వచ్చే వూరేగింపేమిటి బాబూ ? ఎవరైనా మంత్రిగారొస్తున్నారా ?'' అని అడిగింది సీతాలు పక్కనున్న ముసలాయన్ని

''కాదులే! ఆళ్లెవరో వుద్యోగాలు సేసేవోళ్ళు సమ్మె సేత్తున్నారు! జీతాలు పెంచాలంట ఆళ్లకు'' అన్నాడు ''అయ్యో! ఆళ్లందరికీ జీతాలు పెంచాల్సిందేనా ?'' అంటూ ఆశ్చర్యపోయింది సీతాలు

పెద్ద పెద్ద బ్యానర్లను, స్లోగన్స్ వ్రాసిన అట్టలను పుచ్చుకొని నినాదాలు చేసుకొంటూ వూరేగింపుముందుకు వస్తూంది ఆహారం కోసం వెళ్తున్న చీమల బారులా మనుష్యులంతా ఒకరి వెనుక మరొకరు నడుస్తూ అరుస్తున్నారు

'కార్మిక ఐక్యత వర్ధిల్లాలి!'

'బోనసు రేటు పెంచాలి!'

'కార్మికుల కోర్కెలు పరిశీలించాలి!'

'ప్రభుత్వ వైఖరి మారాలి!'

— అంటూ నినాదాలు చేసుకొంటూ వూరేగింపు వస్తూంది వాళ్ళందర్నీ చూసేసరికి సీతాలుకు ఓ రకమైన ఆత్మ ధైర్యం కల్గింది 'జీతాలు చాలక బాధపడేవాళ్ళు సానా మంది వున్నారన్న మాట!' అనుకొంది మనస్సులో ఆమె మనస్సు తేలికపడింది.

ఉత్సాహంగా రోడ్డుమీదికి వచ్చి వూరేగింపులోని వ్యక్తులవైపు చూసింది ఆమె దృష్టి హఠాత్తుగా ఓ పెద్ద బ్యానర్‌ముందు తీవిగా నడుస్తూ రేకు గొట్టంలో 'కార్మిక ఐక్యత వర్ధిల్లాలి' అంటూ అరుస్తున్న వ్యక్తి వైపు మళ్లింది అతన్ని 'అయ్యగారని' గుర్తు పట్టడానికి సీతాలుకు ఎంతో సేపు పట్టలేదు.

అయితే 'కార్మిక ఐక్యత వర్ధిల్లాలి!' అన్న పదానికి అర్థం ఏమిటో ఈనాటివరకు తెల్సుకోలేక పోయింది పాపం సీతాలు!

---

## ధర్మపథం — భర్తను మించిన భార్య

— బులుసు వేంకటరమణయ్య

లౌకిక విషయాలపై అణుమాత్రమూ ఆసక్తి లేని భార్యా భర్తలు ఒక ఊరిలో ఉండేవారు కొన్నాళ్లకు వారికి పూర్తి వైరాగ్యం కలిగింది ఒక చోటిని అంటి పెట్టుకుని వుండడం కూడా వారికి నచ్చలేదు అందువల్ల పుణ్యస్థలాలకు పోతూ, ఆ యా దేవళాలను దర్శిస్తూ, ఎక్కడనో ఒకచోట జీవయాత్రను చాలించాలని సంకల్పించి బయలుదేరారు

స్త్రీకి పురుషునికంటే గమనశక్తి కొంత తక్కువగనే ఉంటుంది కదా! భర్త కొంత ముందుగా పోవడమూ, భార్య వెనకబడడమూ తరచుగా జరుగుతూ ఉండేది అంచేత ముందుగా కొంత దూరం నడచివెళ్లిన భర్త భార్య వచ్చేవరకూ ఆగి, తర్వాత యిద్దరూ కలసివెళ్లడం తటస్థించేది

ఒకసారి భర్త చాలా ముందుకు పోయాడు అక్కడ మట్టిలో అతనికి విలువైన మాణిక్యం ఒకటి కానవచ్చింది దాన్ని చూడగానే అతనికి ఇలా తోచింది 'ఎంత వైరాగ్యమున్నా, స్త్రీలకు నగలపైనీ, ధనంపైనీ, ఇట్టి విలువైన పదార్థాలపైనీ ఆశ పూర్తిగా నశించదు దీన్ని నా భార్య చూస్తే ఆమె మనస్సు చలించిపోవచ్చు అలా జరగకుండా ఉండాలంటే దీనిని చిన్నగుంట చేసి అందులో కప్పివెయ్యడమే మేలైన పని' అని— ఇలా అనుకుని, అతడు చేతితో చిన్న గుంటను చేసి, అందులో ఆ రత్నాన్ని కప్పివేశాడు

అతని భార్య కనుచూపుమేర దూరంలోనే వుండినది తన భర్త నేలపై కూర్చుని ఏదో పని చెయ్యడం ఆమె గమనించింది ఆమె భర్తదగ్గరకు వచ్చి, 'విషయం ఏమిటి?' అని అడిగింది భర్త తాను చేసిన పనిని కప్పిపుచ్చడానికి ఏదో పొంది, పొసగని సమాధానం చెప్పాడు కాని, అది ఆమెకు తృప్తిని కలిగించలేదు

ఆమె అక్కడి మట్టిని కొంచెం తియ్యగా— ఆ మాణిక్యం కానవచ్చింది తన భర్త దాన్ని కప్పివేశాడనీ, అలా కప్పివెయ్యడానికి కారణాన్నీ ఆమె గ్రహించింది తనకు వ్యామోహం కలుగవచ్చుననే సందేహం అతనికి ఉన్నట్లు తెలుసుకుని ''మీరు మట్టికీ, ఈ మాణిక్యానికీ భేదం వున్నట్లు భ్రాంతి పడుతున్నారు. అట్టి భేదం మీకు తోస్తే యిల్లూ వాకిలీ విడిచిపెట్టి వైరాగ్యంతో యిలా రావడమే అనవసరం'' అని అన్నది

ఆయన ఆ మాటను విని సిగ్గుతో తల వంచుకున్నాడు తనకంటె తన భార్యకే ఎక్కువ వైరాగ్యం ఉన్నట్లు ఆ భర్త గ్రహించాడు తలయెత్తి చూసిన ఆయన కనుల నుండి రెండు ఆనందబాష్పాలు రాలడం ఆమె చూసింది